ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య జిల్లా వార్తలు

5

సోమవారం 28 జూలై 2025

ప్రమాదాల కట్ట...

రెడ్డిపల్లె చెరువు కట్టపై నిత్యం ప్రమాదాలు

- రక్షణ గోడలు కరువు
- అధికారులు చర్యలు తీసుకోవాలంటున్న ప్రయాణికులు



ప్రమాదాలకు కారణమవుతున్న రెడ్డిపల్లె చెరువుకట్ట మొదటి మలుపు



మామిడి కాయల లోడు లారీ ప్రమాదానికి కారణమైన మలుపు



ప్రమాద సంఘటన జరిగిన ప్రాంతం

రైల్వేకోడూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లె చెరువుకట్ట ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడ నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ రోడ్డులో అధికంగా వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అయినా రక్షణకు ఈ చెరువు కట్టపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రయాణికులు అంటున్నారు. పుల్లంపేట నుంచి రైల్వేకోడూరు వైపు వచ్చేటప్పుడు మలుపు ఉంది. ఈ మలుపు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారు. రైల్వేకోడూరు నుంచి రెడ్డిపల్లె చెరువుకట్ట మొదటి దారిలో కూడా ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. 15 రోజుల కిందట ఇదే చెరువు కట్టపై మామిడి కాయల లారీ బోల్తా పడి 9 మంది కూలీలు మృతి చెందగా, మరో 9 మంది గాయపడిన విషయం తెలిసిందే. ఇంత పెద్ద ప్రమాదం జరిగినా ఇక్కడ ప్రమాదాల నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెడ్డిపల్లె చెరువుకట్టకు ఇరువైపులా రక్షణ సక్రమంగా లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పినప్పుడు ప్రమాదాల బారినపడుతున్నాయి. రెడ్డిపల్లె చెరువు కట్టకు ఇరువైపులా రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. రైల్వేకోడూరు మార్గంలో మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, హైదరాబాద్ తదితర నగరాల నుంచి వాహనాల్లో ప్రయాణీకులు, పర్యాటకులు, తిరుమలకు భక్తులు, వ్యాపార రీత్యా వచ్చే వాహనాలు వేల సంఖ్యలో వస్తుంటాయి. రెడ్డిపల్లె చెరువు కట్టపై నిత్యం జరుగుతున్న ప్రమాదాల పట్ల ప్రయాణీకులు భయాందోళన చెందుతున్నారు. రైల్వేకోడూరు నుంచి చిన్న ఓరంపాడు దాటుకున్న తర్వాత రెడ్డిపల్లె చెరువు కట్ట మొదలవుతుంది. అక్కడ సెంటర్ పాయింట్‌లో మధ్యలో అధికారులు రబ్బర్ టైప్ పైపులు పొడవాటివి నాటారు. రాత్రి వేళల్లో వీటిని కూడా భారీ వాహనాలు తొక్కించుకునిపోతున్నాయి. అదే విధంగా పుల్లంపేట నుంచి రైల్వేకోడూరుకు వచ్చే రెడ్డిపల్లె చెరువు కట్ట క్రాస్ రోడ్డు మధ్యలో కూడా రబ్బర్ పైపులు నాటారు. ఇవి కూడా తొక్కించుకుని పోతున్నారు. అతివేగం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అధిక లోడుతో వెళుతున్న వాహనాలు అదుపు తప్పుతున్నాయి. రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద మామిడి కాయల లారీ బోల్తా పడి 9 మంది మృతి చెందిన సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించింది. అధికలోడుతో వెళుతున్న డ్రైవర్లు వేగంగా వెళ్లినప్పుడు కంట్రోల్ చేసుకోలేక అదుపుతప్పి వాహనాలు బోల్తాపడుతున్నాయి. మామిడి కాయల లోడుతో వెళుతున్న లారీ లోడులో ఉన్న కారణంగా క్రాస్ రోడ్డు వద్ద ఎత్తు ఉండడంతో అదుపు తప్పి బోల్తా పడి వ్యవసాయ కూలీలు ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. దీంతో అటువైపు వెళ్లే ప్రయాణీకులు భయపడుతున్నారు. రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద మూడు మలుపులు ఉన్నాయి. ఇవి ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా అధికారులు గుర్తించారు. రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద పటిష్టమైన చర్యలు తీసుకోకుండా తూతూమంత్రంగా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే రాళ్లు నాటారు. భారీ వాహనాలకు అవి తట్టుకోవడం లేదు. మామిడి లారీ బోల్తా పడినందుకే రక్షణగా ఉన్న రాళ్లు కూలిపోయాయి. రెడ్డిపల్లె చెరువు కట్ట మధ్య భాగం, చివరి భాగాల్లో ఇనుక రేకులాంటిది రక్షణగా ఏర్పాటు చేశారు. అయితే తగిలితే ఊడిపోయే విధంగా ఉంది. ఏ చిన్న వాహనం అదుపు తప్పినా చెరువులో పడి పోయి ప్రాణాలు గాలిలో కలసిపోతున్నాయి. కాగా సాధారణంగా ఆరు టైర్ల లారీకి పది నుంచి పన్నెండు టన్నులు వేస్తారు. ప్రమాదం జరిగిన లారీ అంతకు మించి కాయలు వేశారని అందుకనే లోడు తట్టుకోలేక కంట్రోల్ చేయలేక ప్రమాదానికి గురైందని పలువురు అంటున్నారు. రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద రక్షణ గోడలు పటిష్టంగా నిర్మించాలని ప్రయాణీకులు, ప్రజలు కోరుతున్నారు.

రెడ్డిపల్లె చెరువు కట్ట వద్ద జరిగిన ప్రమాదాలు

పుల్లంపేట పరిధిలోని రెడ్డిపల్లె చెరువుకట్ట వద్ద రెండేళ్ల నుంచి ఇప్పటి వరకు ఐదు ప్రమాదాలు జరగగా అందులో 10 మంది మృతి చెందగా 19 మందికి గాయాలయ్యాయి. 2023లో జరిగి రోడ్డు ప్రమాదంలో పది మందికి గాయాలు కాగా ఒకరు మృతి చెందారు. 2024లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈనెల 13న జరిగిన ప్రమాదంలో మామిడికాయల లోడుతో వెళుతున్న లారీ బోల్తాపడి 9 మంది మృతి చెందగా మరో 9 మందికి తీవ్రంగా గాయాలయ్యాయి. ప్రతిరోజు చిన్న, చిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. సరైన రక్షణ గోడలు లేకపోవడంతోనే ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. అదే కాకుండా రెడ్డిపల్లె మొదటి నుంచి చివరి వరకు స్పీడు బ్రేకర్లు లేవు. ఇవి ఏర్పాటు చేయాలని అధికారులు ప్రజలు కోరినా పట్టించుకున్న పాపాన పోలేదని తెలిపారు.



రెడ్డిపల్లె చెరువు కట్ట రెండో మలుపు

బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఏమంటున్నారంటే...

రోడ్డు ప్రమాదాలపై ప్రయాణీకులకు ప్రతిసారి అవగాహన కల్పిస్తున్నామని, మద్యం తాగి వాహనాలను నడపరాదని డ్రైవర్లకు కొన్ని సూచనలు, సలహాలు ఇస్తున్నామని రాజంపేట బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధిక లోడుతో వెళుతున్న లారీలు, జీపులు, కార్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కలప లారీ సీజ్



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన కలప లారీ

గుర్రంకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కలప తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు శనివారం రాత్రి సీజ్ చేసినట్లు ఆర్‌ఐ సదాశివప్ప నాయుడు తెలిపారు. మండలంలోని సరిమడుగు పంచాయతీ సుబ్బారెడ్డిగారిపల్లె నుంచి అక్రమంగా కలపను లారీలో తరలిస్తున్నట్లు రెవెన్యూ అధికారులకు సమాచారం అందింది. ఈ క్రమంలో ఆర్‌ఐ సదాశివప్పనాయుడు, వీఆర్వో భాగ్యమ్మలు గ్రామానికి వెళ్లి అక్రమంగా కలప తరలిస్తున్న లారీని నిలిపి రికార్డులు పరిశీలించారు. కలప తరలించడానికి వ్యాపారుల వద్ద ఎటువంటి అనుమతులు లేకపోవడంతో లారీని సీజ్ చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం కలప లారీకి జరిమానా విధించారు.

వైఎస్ కుటుంబంతోనే సతీశ్‌రెడ్డికి ప్రాణహాని

- మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

కడప ఎర్రముక్కపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వైఎస్ కుటుంబంతోనే సతీశ్‌రెడ్డికి ప్రాణహాని ఉందని, ఆయనను టార్గెట్ చేసే పరిస్థితి లేదని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. రాజమౌళి డైలాగులు సినిమాల్లో అయితేనే బాగుంటాయని ఎద్దేవా చేశారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సతీశ్‌రెడ్డి వ్యంగ్య వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సతీశ్‌రెడ్డి పార్టీ నుంచి బయటకు వెళ్లిన తర్వాత ఆయన వెంట వెళ్లింది కేవలం 5 శాతం కేడర్ మాత్రమేనని, మిగిలిన 95 శాతం కేడర్ తమతోనే ఉందన్నారు. వైఎస్ రాజారెడ్డి హత్య కేసులో సతీశ్ పేరును చంద్రబాబు పుణ్యాన తొలగించిన విషయం గురుచేశారు. నీకు ప్రాణహాని ఉండేది వైఎస్ కుటుంబం నుంచే అనే విషయం తెలుసుకోవాలన్నారు. నిన్ను టార్గెట్ చేయాల్సిన అవసరం మాకు లేదని తెలిపారు.

కిటకిటలాడిన రెడ్డెమ్మ కొండ

- సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మిగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయానికి శ్రావణమాసం మొదటి ఆదివారం కావడంతో భక్తులు పోటెత్తారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. సంతానం లేని దంపతులు అమ్మవారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఆలయంలో ఒరపడ్డారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి అధిక సంఖ్యలో ఆలయానికి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

- జేఎస్‌డబ్ల్యూ ఏపీ రాయలసీమ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం
- ఏటా ఒక మిలియన్ టన్నుల ఉత్పాదక సామర్థ్యం
- రెండో విస్తరణతో మరో మిలియన్ టన్నులు
- మొత్తం రూ.16,350 కోట్ల పెట్టుబడి

జమ్మలమడుగు/కలికిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటు నిర్మాణం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జిల్లా ప్రజలకు కూటమి సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో ఈ ప్లాంట్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారిశ్రామిక రాయితీలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కూడా ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్‌ప్లాంటు పేరుతో ఉక్కు ఉత్పత్తి కర్మాగారాన్ని ఏర్పాటు చేసేందుకు ఆ సంస్థ ముందుకు రావడాన్ని స్వాగతిస్తూ 400 కిలోవాట్ల సామర్థ్యంతో డబుల్ సర్క్యూట్ ట్రాన్స్‌మిషన్ విద్యుత్ లైనుతో 268 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు, ఏడాదికి గండికోట నుంచి రెండు టీఎంసీల నికర జలాలను మైలవరం డ్యాం నుంచి 15 కి.మీ. పైపులైను ద్వారా సరఫరా చేయడానికి, ఎన్‌హెచ్ 67 నంబరు రోడ్డు కనెక్టివిటీకి నాలుగు లేన్ల రహదారి ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కేంద్రంతో సంప్రదించి పీఎం గతి శక్తి పథకం కింద ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల స్టేషన్ల మధ్య ముద్దనూరు స్టేషన్‌ను కలుపుతూ 12 కి.మీ. రైల్వే లైను విస్తరణకు ఏపీ ప్రభుత్వం అంగీకరించడంతో పాటు కంపెనీ అందజేసే ముడిసరుకు ప్రణాళిక మేరకు సీ పోర్టుకు అనుసంధానం చేసేందుకున్న అవకాశాలను ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా పరిశీలించేందుకు ప్రభుత్వం హామీ ఇచ్చింది. అంతేగాకుండా సున్నపురాళ్లపల్లె వద్ద 1,100 ఎకరాలను ఎకరా రూ.5 లక్షల ప్రకారం అప్పగించేందుకు కూడా ప్రభుత్వం ముందుకొచ్చింది. జేఎస్‌డబ్ల్యూ కంపెనీ మొదటి విడతగా రూ.4,500 కోట్లు పెట్టుబడితో ఏడాదికి ఒక మిలియన్ టన్నులను ఉత్పత్తిని, రెండో విడతో రూ.11,850 కోట్లు పెట్టుబడితో (మొత్తం రూ.16,350 కోట్లు) మరో మిలియన్ టన్నుల ఉత్పత్తిని చేసేందుకు ప్రతిపాదించింది. రెండు విడతల్లో మొత్తం 2500 మందికి ప్రత్యక్ష ఉపాధికి హామీ ఇచ్చింది. 2026 జనవరిలో నిర్మాణాలు ప్రారంభించి 2029 మార్చి నాటికి పూర్తి చేస్తామని, 2029 ఏప్రిల్‌లో ఉత్పత్తి ప్రారంభించేందుకు కూడా కంపెనీ ప్రతిపాదించింది.



స్టీల్‌ప్లాంట్ శిలాఫలకం

జయంతి జనతా ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

- రైల్వే సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



బోగీని పరిశీలిస్తున్న రైల్వే, ఫైర్ సిబ్బంది

నందలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కన్యాకుమారి నుంచి పూణె వెళ్లే జయంతి ఎక్స్‌ప్రెస్ (16381) రైలులో పొగలు వ్యాపించడంతో సిబ్బంది గుర్తించి మంటలను ఆర్పివేసిన సంఘటన ఆదివారం ఉదయం నందలూరు రైల్వేకేంద్రంలో జరిగింది. జయంతి జనతా ఎక్స్‌ప్రెస్ 3 ఏసీ కోచ్ నెంబరు (22324) బోగి కింద మంటలు రావడాన్ని గమనించిన హస్తవరం స్టేషన్ సిబ్బంది నందలూరు స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన నందలూరు స్టేషన్ మేనేజర్ కమలాకర్, స్టేషన్ మాస్టర్ మురళీమోహన్‌లు రాజంపేట ఫైర్ సిబ్బందికి సమాచారం తెలియజేసి రైలు లోకోపైలట్ గార్డ్‌తో వాకీటాకీలో మాట్లాడి ట్రైన్‌ను ఆపివేసి రాజంపేట ఫైర్ సిబ్బందితో మంటలు ఆర్పించారు.

బీ2 ఏసీ కోచ్ బ్రేక్ సరిగా రిలీజ్ కాకపోవడం వల్ల ఈ మంటలు వచ్చాయని రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే సిబ్బంది బ్రేక్ రిలీజ్ చేసుకుని తిరిగి రైలును కదిలించారు. సరైన సమయంలో రైల్వే సిబ్బంది అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

- రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

ఒంటిమిట్ట, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఏడాది పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఆదివారం మండలంలోని కొత్తమాధవరం గ్రామంలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందించిందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఎస్వీ రమణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, మండల నాయకులు హరినాథ్‌రెడ్డి, చింతగింజల సుబ్రహ్మణ్యం, బొడిచెర్ల శ్రీనివాసులు, శ్రీనివాసరాజు, పీవీ రమణ, నామాల వెంకటయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కడప జిల్లాలో 20 సూత్రాల చైర్మన్ పర్యటన

కడప కలెక్టరేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ 28వ తేదీ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన కడప నుంచి ఉదయం 9 గంటలకు బయలుదేరి 11 గంటలకు గండికోట చేరుకోనున్నారు. 11-12 గంటల వరకు గండికోట ఫోర్ట్, పెన్నానది ప్రాంతాలను సందర్శిస్తారు. అనంతరం తిరిగి రోడ్డు కడపకు చేరుకుని మధ్యాహ్నం 3 -5 గంటల వరకు కలెక్టరేట్‌లో ఆకాంక్షిత జిల్లా అంశంపై కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. కార్యక్రమానంతరం ఆయన విజయవాడకు బయలుదేరి వెళతారు.

తొలి అడుగులో ప్రజల సంతృప్తి

- సుపరిపాలన-తొలి అడుగుకు భారీ స్పందన
- రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్ బకాయిలు రూ.18 వేల కోట్లు
- రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



మంగంపేటలో తొలిఅడుగు కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



మంగంపేట వద్ద భారీ జనసందోహం

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలందరికీ అందుతున్నాయని, ముఖ్యంగా పులివెందులలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలం మంగంపేటలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ముందు గా మంగంపేట వద్ద పార్టీ జెండావిష్కరణ చేశారు. అనంతరం గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రికి గజమాలతో స్వాగతం పలికారు. మంగంపేటకు వందలాదిగా కార్య కర్తలు, నాయకులు తరలిరావడంతో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం టీడీపీ నేత అనుముల గుండం చంద్రశేఖర్ ఇంట్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో తల్లికి వందనం కింద డబ్బులు అందరికీ పడ్డాయని చాలా సంతృప్తి చెందినట్లు అక్కడి ప్రజలు తాను వెళ్లినప్పుడు చెప్పారని గుర్తు చేశారు. హంద్రీనీవా, గాలేరు-నగరి తదితర ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఐదేళ్ల కాలంలో వైసీపీ రాయలసీమకు చేసిందేమీ లేదన్నారు. రాయలసీమ బిడ్డ అని ప్రగల్బాలు పలికిన జగన్ రాయలసీమకు ద్రోహం చేశారన్నారు. పోలవరం, బనకచర్ల నుంచి నీరు అందితే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి మానవ తప్పిదమే కారణమని, ఇసుక మాఫియా కోసం సకాలంలో గేట్లు ఎత్తకపోవడంతో 20 గ్రామాలు కొట్టుకునిపోయి 42 మంది మృతి చెందారని తెలి పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్నమయ్య ప్రాజెక్టు కోసం నివేదికలు తెప్పించుకుని దాని నిర్మాణానికి కావాల్సిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గాలేరు-నగరి సుజలస్రవంతికి రూ.1500 కోట్ల బ్యాలె న్సు పనులు ఉన్నాయన్నారు. రైల్వేకోడూరు గుంజన నది రక్షణ గోడకు రూ.38.8 కోట్లు మంజూరు చేశామని, పనులు త్వరగా మొద లు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

టీడీపీ ఇన్‌చార్జ్ కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో 40 కుంటలు, 56 చెరువులు ఉన్నాయని వాటి మరమ్మతులకు సుమారు రూ.30 కోట్లు కావాలని, గాలేరు-నగిరి సుజలస్రవంతిని రైల్వేకోడూరు నియోజకవర్గానికి అందించాలని కోరారు. సోమశిల లిఫ్ట్ ఇరిగేషన్ పెండింగ్‌లో ఉందని మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాశ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దుద్యాల అనితదీప్తి, కూటమి నాయకులు కల్లా చలపతి, అనుములగుండం చంద్రమోహన్, గునిపాటి రాయుడు, గునిపాటి కిరణ్, రైల్వేకోడూరు క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పఠాన్ మౌలా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు కసరత్తు

- జిల్లాలో పెరగనున్న కేంద్రాలు
- ఒక్కో కేంద్రంలో 1200 మంది ఓటర్లే
- జాబితా నుంచి నాన్ రెసిడెంట్ ఓటర్ల తొలగింపు
- పూర్తయిన బీఎల్‌వోల శిక్షణ

ఎన్నికల పక్రియలో సమూల మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోనుంది. బతుకుదెరువు కోసం వలస వచ్చిన రోహింగ్యాలు ఓటు హక్కు పొంది, దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో ఇలాంటి ఓటర్లను జల్లెడ పట్టి ఏరి వేసే పక్రియకు కేంద్ర ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది.

కడప కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, నాన్ రెసిడెంట్ ఓటర్ల తొలగింపులకు సంబంధించి ఇప్పటికే బీహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఆర్ఐ) పేరుతో జూన్ నెలలో షెడ్యూల్ విడుదల చేసి ప్రక్రియను ముమ్మరం చేశారు. అదే విధానం దేశవ్యాప్తంగా అమలు జరగనున్న నేపథ్యంలో కార్యాచరణకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని మన రాష్ట్ర ఎన్నికల కమిషనరు వివేక్ యాదవ్ గత జూన్‌లో జిల్లా కేంద్రాలకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో ఎన్నికల అధికారులు, సిబ్బంది స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు కసరత్తు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1200కు మించకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విదానం పక్కాగా అమలు జరిగితే జిల్లాలో ఇపుడున్న 1968 పోలింగ్ కేంద్రాలకు తోడుగా. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి మరో 500 వరకు పెరిగి 2400 పైగా పీఎస్‌లకు చేరుకోవచ్చని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.



జిల్లాలో పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ముందస్తుగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభించింది. కడప నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు ఒకడుగు ముందుకేసి ఇప్పటికే 287 పోలింగ్ కేంద్రాలను ఫిల్టర్ చేశారు. దాదాపు 50 పోలింగ్ కేంద్రాలను సరిదిద్దేందుకు సిద్ధమయ్యారు. 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు, పక్కా భవనాలు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వాటిలో 25 పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ భవనాలలోకి మార్చేందుకు ఎన్నికల అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ ప్రోగ్రామ్‌కు సంబంధించి ఆగస్టు నెలలో షెడ్యూల్ విడుదల చేయనుండడంతో జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 2400 వరకు దాటొచ్చంటున్నారు. పెరగనున్న పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా బీఎల్వోలు, ఎన్నికల రిటర్నింగ్, సహాయ అధికారుల ఖాళీలు భర్తీ చేయనున్నారు.

బీఎల్ఓలకు శిక్షణ పూర్తి

జిల్లాలో 16.62 లక్షల మంది ఓటర్లుండగా, 1968 పోలింగ్ కేంద్రాలు, అంతే స్థాయిలో బూత్ లెవల్ అధికారులు ఉన్నారు. వీరందరికీ ఎస్ఐఆర్ ప్రోగ్రాం కింద కలెక్టరేట్‌లోని సభాభవనంలో శిక్షణ ఇచ్చారు. జిల్లా నుంచి ఎంపిక చేసిన సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ఆది చినవేమయ్య ఢిల్లీలో శిక్షణ పొంది జిల్లాలో మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించారు. కాగా ప్రతి ఏటా స్పెషల్ సమ్మరీ రివిజన్ పక్రియ జరగడం ఆనవాయితీ. ఈ ధపా ఆ ప్రక్రియ ప్రారంభం నాటికి ఎస్ఐఆర్ ప్రోగ్రాం ద్వారా సేకరించిన సమాచారంతో పక్కా ప్రణాళికతో సవరణలతో జనవరి 1 నాటికి ఓటర్ల తుది జాబితా పక్కాగా రూపు దిద్దుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కారు ఢీకొని ఒకరి మృతి

దువ్వూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలం సి. బయనపల్లి డాబా వద్ద ఆదివారం కారు ఢీకొని కె.మాబూషరీఫ్ (52) అనే వ్యక్తి మృతి చెందాడు. చింతకుంట గ్రామానికి చెందిన ఈ వ్యక్తి పెట్రోలు పట్టించుకుని నాలుగు రోడ్ల కూడలిలో బైక్‌ను యూటర్న్ తీసుకుని రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొందని స్థానిక పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

బాలుడిపై వీధి కుక్క దాడి

బద్వేలుటౌన్, జులై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుమిత్రానగర్‌లోని ప్రదీప్ పాఠశాల వద్ద ఆదివారం సుశాంత్ అనే బాలుడు వీధిలో ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడిచేసింది. బాలుడి కుడిచేతిని నోటితో పట్టుకుని ఈడ్చుకుంటూ వెళుతుండగా స్థానికులు గమనించి రక్షించారు. ఈ ప్రయత్నంలో మరో ఇద్దరిపై దాడి చేసింది. బాలుడి తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించారు. మున్సిపాలిటీలో ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్కలదాడిలో గాయాలపాలవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గాయపడిన సుశాంత్

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో వేర్వేరు ప్రాతాఅలకు చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నం చేశారని ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం, పెంచుపాడుకు చెందిన బాలాజీ నాయక్ భార్య శాంతమ్మ(38) కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందుతాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి మందలించాడని నీరుగట్టువారిపల్లెకు చెందిన రమణ కుమారుడు అశోక్ (19) పురుగుల మందు తాగాడు. స్థానికులు అతనిని ఆస్పత్రికి తరలించారు. తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు నాగార్జున (22) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రెఫర్ చేశారు

కారు, బైకు ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు

రాజంపేట టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కారును బైకు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రశాంత్ ఆదివారం సాయంత్రం బైక్‌పై వెళుతూ మండల పరిధిలోని బోయనపల్లె వద్ద కడప నుంచి తిరుపతి వెళుతున్న కారును ఢీకొన్నాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతనిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు తిరుపతికి తరలించారు. రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ కుళాయప్ప తెలిపారు.


యువతి అదృశ్యం

కలసపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తన అమ్మమ్మకు ఆరోగ్యం సరిగా చూసేందుకని ఇంటి నుంచి బయలుదేరిన యువతి మూడు రోజులైనా ఇంటికి చేరలేదంటూ యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలసపాడు ఎస్ఐ తిమోతి తెలిపిన వివరాల మేరకు ప్రకా శం జిల్లా కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామానికి చెందిన నగిలి శశికళ తన అమ్మమను చూసేందుకు ముద్దవారిపల్లెకు వెళతానని చెప్పి బయలుదేరిన ఆమె. మూడు రోజులైనా ఇంటికి చేరలేదు. అమ్మ ఇంటికి కూడా వెళ్లకపోవడంతో ఆమె తల్లిదండ్రులు నగిలి సర్వేశ్వర రావు, వేలాంగిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వా లని ఎస్ఐ తెలిపారు.



శశికళ

కారుబోల్తా.. నలుగురికి గాయాలు





బోల్తాపడిన కారు, అంబులెన్స్‌లో గాయపడిన వ్యక్తి

జమ్మలమడుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తా పడడంతో నలుగురు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. ప్రొద్దుటూరులోని మేదర వీధికి చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం జమ్మలమడుగు మండలం గండికోటను చూసేందుకు వెళ్లారు. సాయంత్రం ప్రొద్దుటూరుకు తిరిగి వెళుతుండగా గొరిగెనూరు- ధర్మాపురం గ్రామాల మధ్య కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న రాతి దిమ్మెలు ఢీకొని పొలంలో బోల్తాపడింది. ఈ ఘటనలో పసుపులేటి హేమంత్, ప్రదీప్ అనేవారితోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. విషయం గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం లేదని జమ్మలమడుగు పోలీసులు తెలిపారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

జమ్మలమడుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు కేటాయించడంపై ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్మికులు ఆదివారం ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విజయవాడలో ప్రైవేటు సంస్థలకు గ్యారేజీ స్థలాలను అప్పగించడాన్ని రద్దు చేయాలని కోరారు. ఏఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిండెంట్ ఎంజీసీవో రెడ్డి, కాంతయ్య, గురుస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచ వృత్తులను పరిరక్షించాలి

- ఈశ్వరీదేవి మఠాధిపతి వీర శివకుమార స్వామి

బ్రహ్మంగారిమఠం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచ వృత్తులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని, వాటిని కాపాడేందుకు విశ్వబ్రాహ్మణులందరూ ప్రయత్నం చేయాలని జగన్మాత ఈశ్వరీదేవి మఠాధిపతి వీరశివకుమారస్వామి పిలుపునిచ్చారు. జూలై 6న తెలంగాణలోని ఎల్‌బీనగర్‌లో ప్రారంభమై 22 రోజులపాటు కొనసాగిన విశ్వబ్రాహ్మణ సాంస్కృతిక చైతన్య యాత్ర ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి మఠం చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర తొలి సభాపతి ప్రస్తుత శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు బంగారు బాబు, హైదరాబాదు క్రైం బ్రాంచ్ ఏసీపీ కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి మాట్లాడుతూ రానురాను విశ్వబ్రాహ్మణులు వారి నైపుణ్యాలను మరిచిపోతున్నారని, రాబోవు తరానికి కూడా చేతివృత్తులు నేర్పించాలని తెలిపారు. అనంతరం ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన రచయిత, క్రియాశీల విశ్వకర్మ కార్యకర్తగా విశ్వనాథుల పుష్పగిరి దశాబ్దాల కాలంగా పలు రాష్ట్రాల్లో విస్తృతంగా పని చేస్తున్నాడని, దేశవ్యాప్త విశ్వకర్మ ఉద్యమం నిర్మించేందుకు పెద్ద ఎత్తున కార్యాచరణ రూపొందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఈ పాదయాత్ర నిర్వహించారన్నారు. విశ్వబ్రాహ్మణులు సాంస్కృతికంగా పునర్వైభవం సాధించాల్సిన ఆవశ్యకతను వివరించారు. బాపట్ల బీజేపీ అధ్యక్షుడు బంగారుబాబు , మధుసూదనచారి మాట్లాడుతూ దేశంలో సంస్కృతీ సంప్రదాయాలకు మూలస్థానంగా నిలిచిన దేవాలయాలకు విశ్వబ్రాహ్మణులే మూలకారణంగా నిలిచారన్నారు పాదయాత్ర ద్వారా విశ్వబ్రాహ్మణ సమస్యలపై పోరాటం సాగించడంలో విశ్వనాథుల పుష్పగిరి సఫలమయ్యాడని, విశ్వ బ్రాహ్మణులు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమయ్యే సందర్భాన్ని సృష్టించాడన్నారు. విశ్వకర్మలు ఐక్యంగా నిల బడి తమ శక్తిని నిరూపించుకోవాలన్నారు. లక్ష్మీనారాయణ, కంజర్ల కృష్ణమూర్తి, సొల్లేటి ప్రభాకరచారి, బాల నరసింహచారి, రంజిత్, బుగ్గిర్ల సతీష్, రాజశేఖర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మఠాధిపతి వీరశివకుమారస్వామి

ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకుందాం..

- ఏపీ మత్స్యకార నేత అర్జున్

కడప మారుతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న మత్స్యకారుల సమస్యలను ఐత్యతతో పరిష్కరించుకుందామని ఏపీ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ అర్జున్ సూచించారు. ఆదివారం స్థానిక రాజీవ్ పార్క్ సమీపంలోని సమాఖ్య జిల్లా కార్యాలయంలో జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్ అధ్యక్షతన రాయలసీమ స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాయలసీమ జిల్లాల్లోని వన్నెకుల క్షత్రియ, బెస్త తదితర మత్స్యకార కులాలకు వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులు కేటాయించడంతో పాటు సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపత్ యోజన కింద ఇస్తున్న పథకాలలో సబ్సిడీ 40 శాతం నుంచి 80 శాతానికి పెంచాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని తీర్మానం చేశామన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అర్జున్ సమక్షంలో రాయలసీమ జిల్లాల కమిటీని ఎన్నుకున్నారు. ఆ మేరకు కడప జిల్లా అధ్యక్షుడుగా వై. శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడుగా బాలసుబ్రమణ్యం,ప్రధాన కార్యదర్శిగా హోళిసాయితోపాటుగా సీమ నాలుగు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మత్స్యకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్

భారీ తేడాతో అనంతపురం విజయం

- చిత్తూరు-నెల్లూరు మ్యాచ్ డ్రా

కడప స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్ 16 మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆదివారం కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు 221 పరుగులు భారీ తేడాతో విజయం సాధించింది. అలాగే చిత్తూరు - నెల్లూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా..

కేవోఆర్ఎం మైదానంలో

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో మూడోరోజు బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 70.4 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 295 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. దీంతో రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 505 పరుగులు చేసినట్లయింది. ఇందులో దేవాన్ష్ 41 పరుగులు చేశారు. అనంతరం కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లోకి దిగి ఆట ముగిసే సమయానికి 49.1 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. దీంతో అనంతపురం 221 పరుగులతేడాతో విజయం సాధించింది. అనంతపురం బౌలరు కిరణ్‌కుమార్ ఆరు వికెట్లు తీసుకున్నాడు

ఏసీఏక్రికెట్ మైదానంలో

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు - నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో రెండో రోజు నెల్లూరు జట్టు 103.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టుకు 18 పరుగుల మొదట ఇన్నింగ్స్ ఆధిక్యత లభించినట్లయింది. ఇదిలా ఉండగా ఓవర్ నైట్ స్కోరు 40 పరుగులతో మూడోరోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 99 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 414 పరుగులు సాధించింది. ఇందులో హర్ష 167 పరుగులు, తనీశ్వర్ 102 పరుగులు చేయడం విశేషం. ఎంఎస్ అహ్మద్ 83 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.



కిరణ్‌కుమార్ ఆరు వికెట్లు





హర్ష (చిత్తూరు) 167పరుగులు



తనీశ్వర్ 102 పరుగులు

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు





రన్నింగ్ చేస్తున్న క్రీడాకారులు, హైజంప్ చేస్తున్న యువకుడు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం ఉదయం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూనియర్ అథ్లెటిక్స్, అండర్-18, అండర్-20 మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 100, 200, 400, 800 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, హైజంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బాపట్లలో రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమద్‌బాషా, వ్యాయామ సంచాలకులు నాగూర్, శివారెడ్డి, సుబ్బయ్య, ఎర్రన్న, నాగేశ్వరరావు, దిలీప్, ఖాదర్‌రెడ్డి, బాషా పాల్గొన్నారు.

ఆస్పత్రి ముందు ప్రైవేటు అంబులెన్స్‌ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లె అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఘర్షణ శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రి ముందు ఉన్న అంబులెన్స్‌లు తొలగించారు. ఇకపై అక్కడ అంబులెన్స్‌లు నిలుప రాదని హెచ్చరించారు. అంబులెన్స్ డ్రైవర్లను టూటౌన్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ రామచంద్ర తెలిపారు.



అంబులెన్స్‌ల తొలగింపుతో ఖాళీగా ఆస్పత్రి పరిసరాలు

రూ. 38.8 కోట్లతో గుంజన నదికి రక్షణ గోడ



గుంజన నది వద్ద పంతగానితో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

రైల్వేకోడూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గుంజన నదికి రక్షణగోడ నిర్మాణానికి రూ. 38.8 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం గుంజననది ప్రాంతా న్ని ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. గుంజన నదికి వరదల కారణంగా ప్రతి ఏటా నిరుపేదల ఇళ్లు కొట్టుకుపోతున్నాయని, దీంతో వారు ఇతర ప్రాంతాలకు వెళ్లి తల దాచుకోవాల్సి వస్తోందన్న విషయాన్ని టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి స్పందించి పనులు అతి త్వరగా గుంజన నదికి రక్షణగోడ నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతు రాజు నవీన్, నార్జాల హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజకు విరాళం అందిస్తున్న పబ్బతి రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు

చక్రాయపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఆదివారం రూ.1,01,116 విరాళం అందినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా పులివెందులకు చెందిన పబ్బతి రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం కృష్ణవేణమ్మ కుమారుడు దక్షిణామూర్తి ధర్మపత్ని లక్ష్మీప్రసన్న ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. ఈ విరాళాన్ని ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన అర్చకుడు వర్ది కేసరిలకు అందించినట్లు తెలిపారు. వీరికి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి తీర్థ, ప్రసాదారాలు అందించడం జరిగిందన్నారు.

వృక్షాల కూల్చివేతపై నోటీసులు జారీ



బాకరాపేట ఫారెస్ట్ బీట్ పరిధిలో విద్యుత్ సిబ్బంది కూల్చివేసిన వృక్షాలు

సిద్దవటం, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ లైన్ పనుల్లో భాగంగా బాకరాపేట ఫారెస్ట్ బీట్ పరిధిలో టేకు చెట్లను కూల్చి వేసిన విద్యుత్ అధికారులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ విషయంపై ఆది వారం కడప ఫారెస్ట్ రేంజ్ అధి కారి ప్రసాద్ మాట్లాడుతూ కడప రేంజి బాకరాపేట బీట్ పరిధిలోని ఓ రైతు సాగు చేసిన పెద్ద పెద్ద వృక్షాలు, టేకు చెట్లను విద్యుత్ అధికారులు పూర్తిగా తొలగించారన్నారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం అందించక పోవడంతో వారికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. అటవీ పరిధిలోని పంట పొలాల్లో, బీడు భూముల్లో, రైతు పంట పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు తొలగించరాదని, పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆయన వివరించారు.

టీడీపీతోనే సుపరిపాలన సాధ్యం

● నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ● మంగంపేటలో మంత్రికి ఘన స్వాగతం



మహిళల సమస్యలు వింటున్న మంత్రి నిమ్మల.. చిత్రంలో చమర్తి జగన్‌మోహన్‌రాజు



మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, వరలక్ష్మి, సాయివికాస్ రెడ్డి

రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, జూలై 27(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంతి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం ఆయన మంగంపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు, రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు, అనుమలగుండం చంద్రమోహన్, కల్లా చలపతి, గునిపాటి కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మంత్రికి గజమాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మంగంపేటలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తర్వాత ముక్కావారిపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముక్కా రూపానందరెడ్డి నివాసానికి చేరుకుని నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, ముఖ్యమంత్రి సహాయనిధి పంపిణీలో రాష్ట్రంలోనే రైల్వేకోడూరు రెండోవ స్థానంలో ఉందని తెలుసుకున్న మంత్రి ముక్కాను అభినందించారు. నాలుగేళ్లపాటు ఇలాగే అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. అనంతరం జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ మంత్రికి స్వాగతం పలికారు. గుంజననది వద్ద రక్షణ గోడను నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. తర్వాత టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడుతో మంత్రి చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రాజు, కొటారు సుబ్రమణ్యం, అనుమలగుండం హరిక్రిష్ణ, గునిపాటి వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ పోకూరు సుబ్రహ్మణ్యం, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వరనాయుడు, బీసీ నాయకుడు నాయుడోరి రమణ, దళిత నాయకుడు నందవరం అజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఒంటిమిట్టలో ఘనస్వాగతం

ఒంటిమిట్ట, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటిపా రుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఒంటిమిట్టలో ఘనంగా స్వాగతం పలికారు. ఆదివా రం మధ్యాహ్నం రాజంపేట నుంచి కడపకు వెళు తుండగా మార్గమధ్యంలోని ఒంటిమిట్టలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకు లు శ్రీరామ ఎత్తిపోతల పథకానికి నిధులు మం జూరు చేసి ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందిం చాలని కోరారు. అలాగే మండలంలో నెలకొన్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, సీనియర్ నాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ ఎస్వీ రమణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, ఒంటిమిట్ట చెరువు సంఘం అధ్యక్షుడు గంగిరెడ్డి, వైస్ చైర్మన్ కట్టా యానాదాయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం

రాజంపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు అన్నారు. ఆదివారం మందరం రాచపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలకు కేంద్ర బిందువుగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి సుబ్రహ్మణ్యం నాయుడు, అత్తిరాల దేవస్థానం మాజీ చైర్మన్ శంకర్‌రాజు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షుడు పోలి శివకుమార్, గన్నే సుబ్బనరసయ్యనాయుడు, రాంప్రసాద్, ముప్పాల శంకర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనపై వైసీపీ అడ్డుగోలు ప్రచారం

సిద్దవటం, జూలై 27(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని జంగాలపల్లె గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పరిపాలనలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలుపరుస్తూ ఉంటే వైసీపీ తప్పుడు ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. అలాగే మండలంలోని ఎస్.రాజంపేట ఎస్సీ కాలనీలో తెలుగు యువత అధికార ప్రతినిధి రాంప్రసాద్ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, బి.సుబ్బయ్య, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఒక అబద్ధాల పుట్ట

రాయచోటిటౌన్, జూలై27(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఒక అబద్ధాల పుట్ట అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని దూదేకులపల్లెలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు నీచరాజకీయాలు చేస్తూ అవసానస్థితిలో ఉన్న పార్టీని నిత్యం ఏదో డ్రామా నడిపిస్తూ వెళ్తున్నారన్నారు. వ్యవస్థను దుర్వినియోగం చేసిన నీచ చరిత్ర వైసీపీదేనన్నారు.

టీడీపీతోనే సుపరిపాలన

గాలివీడు, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంతో ప్రజలకు సుపరిపాలన అందుతుందని పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి అన్నారు. ఆదివారం పూలుకుంట గ్రామం ఈడిగపల్లె దళితవాడలో సుపరిపానలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ పూలుకుంట బోరెడ్డిగారిపల్లె పంచాయతీ పరిధిలోని 222 పోలింగ్ బూత్‌లో గడప గడపకు కార్యక్రమం పూర్తయ్యిందని, 223 బూత్‌లో 75 శాతం పైబడి పూర్తయ్యిందన్నారు. మూడు పోలింగ్ కేంద్రాల్లో తొందరలో ఈ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహమ్మద్‌రఫీ, సీనియర్ టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, యువగళం సభ్యులు సాయిప్రసాద్‌రెడ్డి, భూత్‌కన్వీనర్లు శివశంకర్, వెంకట్రమణ, డీలర్ టోపీవలిసాబ్, ఎప్ఏలు మహేశ్వర్‌రెడ్డి, వీరాంజనేయులు, టీడీపీ నాయకులు నాగార్జున, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

రామాపురం, జూలై 27(ఆంధ్రజ్యోతి): చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు బండారు తిమ్మారెడ్డి, ఏనుగుల సుధాకర్, చిట్టి రెడ్డెయ్య, కొరివి ధనుంజయ, గంజికుంట నాగరాజు, మూడే రాజానాయక్, అధికార వెంకటసుబ్బయ్యలు అన్నారు. ఆదివారం మండలంలోని కసిరెడ్డిగారి పల్లెలోని కొత్తరోడ్డు నారాయణపురం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలన్నీ అర్హులకే అందేలా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాలను అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరహరి, వెంకట్రమణ, గంగయ్య, యల్లయ్య, సుబ్బరాయుడు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజల పక్షం

నందలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. ఆదివారం ఆడపూరులో సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో ఒకపక్క అభివృద్ధి, మరోపక్క సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. కార్యక్రమంలో యూనిట్ కోకన్వీనర్ రమేష్, బీసీ, ఆర్.మణికంట, గురుకుల పాఠశాల చైర్మన్ వేణు, నాయకులు భాను, చంద్ర, రామయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటం మండలం జంగాలపల్లెలో మాట్లాడుతున్న క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు



రాయచోటి పట్టణం దూదేకులపల్లెలో గాజుల ఖాదర్‌బాషా..



ఈడిగపల్లె దళితవాడలో..



కొత్తరోడ్డు నారాయణపురంలో..



నందలూరు ఆడపూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఆటో కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ

పెనగలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆటో కార్మికులకు ఆదివారం ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా ఆర్‌సీ, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు కూడా కలిగి ఉంటే డ్రైవర్‌కు, బండికి ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి వై.చలపతి తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి

19 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

రాయచోటిటౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్యశిబిరంలో 19 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజకవర్గంలోని కేవీపల్లి, ఎర్రావారిపలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెలతో పాటు కదిరి, ఎన్‌పీకుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్నవారికి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుగులమ్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు

సిద్దవటటం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపల్లె క్రాస్ వద్ద వెలసిన ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రమణ మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమార్చన, గణపతిపూజ, పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని పసుపు కుంకుమతో అలంకరించామన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాలు వెంటనే చెల్లించాలి

రాయచోటిటౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు వెంటనే కేటాయించి జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని డైట్ కేంద్రంలో జరిగిన ఎన్‌టీఏ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ముఖ ఆధారిత హాజరు నమోదుకు గతంలో ఇచ్చిన హామీలను అనుసరించి ఉదయం 9 గంటల 10 నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్‌గా ప్రకటించాలన్నారు. స్పాట్ వాల్యూయేషన్ ముగిసి 3 నెలలు అయినప్పటికీ రెమ్యూనరేషన్ చెల్లించకపోవడం దారుణమన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లి రికవరీ రాకపోవడం వల్ల పూర్వపు పాఠశాలల్లో కొనసాగుతున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. డీఎస్సీ ఉపాధ్యాయులు వచ్చేవరకు ఎంత సమయం పడుతుందో తెలియక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే విద్యా వలంటీర్లు నియమించి వారికి ఉపశమనం కల్పించి విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, పకీర, నరసింహారెడ్డి, బచ్చల శ్రీనివాసులు, వేణుగోపాలరావు, కులశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొండూరు శ్రీనివాసరాజు

మంత్రి దృష్టికి పెనగలూరు చెరువు దుస్థితి



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

పెనగలూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): పెనగలూరు చెరువు మరమ్మతులపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని టీడీపీ మండల నాయకులు కోరారు. ఆదివారం రైల్వేకోడూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాధనాయుడు ఆధ్వర్యంలో కలిసి చెరువు దుస్థితిపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021లో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పుడు వరదనీరంతా పెనగలూరు చెరువుపై పండడంతో చెరువుకట్టకు నాలుగు చోట్ల భారీగా గండ్లు ఏర్పడ్డాయన్నారు. నాటి వైసీపీ ప్రభుత్వం చెరువుకట్ట మరమ్మతులు చేసేందుకు రూ.6 కోట్లతో ఎస్టిమేట్‌లు తయారు చేసిందని, కానీ అవి నేటికీ అలాగే మిగిలిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి, గంగినాయుడు, నీటి సంఘం అధ్యక్షుడు రామసుబ్బానాయుడు, ఎన్.రాంప్రసాద్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలి

రాయచోటిటౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సు కోసం పాటు పడాలని మానవతా సంస్థ చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి కోరారు. రాయచోటి పట్టణంలోని కొత్తపేటలో ఉన్న ప్రతిభా జూనియర్ కళాశాలలో ఆదివారం మానవత నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత సంస్థ చేసే ప్రతి సేవా కార్యక్రమంలో సభ్యులంతా తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షుడు అంకం జయచంద్రారెడ్డి, గౌరవ సలహాదారుడు వెంకట్రమణ, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి (బాబు), కోశాధికారి టేకూరి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

మానవతా సేవలు అభినందనీయం

లక్కిరెడ్డిపల్లె, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మానవతా సేవలు విస్తరించడం అభినందనీయమని మానవతా చైర్మన్ బాల సుబ్రమణ్యం అన్నారు. ఆదివారం స్థానిక నలంద పాఠశాలలో మానవత స్వచ్ఛంద సేవా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మంచి విలువలతో కూడిన సేవా సంస్థ అని, ఈ సంస్థ చేసే కార్యక్రమాలు పేదలకు ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు వై.ప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లెలో మానవత సేవలు ఆపదలో ఉన్న అభాగ్యులందరికీ చేరే విధంగా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మనవతా అధ్యక్షుడు షఫీనాయక్, కోశాధికారి రవిశంకర్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ చైతన్యరెడ్డి, శివయ్య, మానవతా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలికకు మానవత సంస్థ ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవతా సభ్యులు

సుండుపల్లె, జూలై 27 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలం దిగువ గుల్లావాండ్లపల్లెకు చెందిన జ్యోతి అనే బాలిక తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ బెంగుళూరు సెయింట్ జాన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. మానవత చైర్మన్ గంగిరెడ్డి రూ.10వేలు, ఇతర మానవతా సంస్థ సభ్యులు రూ.7వేలు కలిపి మొత్తం రూ.17వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో మానవతా సభ్యులు హరికుమార్, అమ్మనాయక్, నరసింహా, సూరి, నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

లక్కిరెడ్డిపల్లె, జూలై 27(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్‌ఆర్ నివాసంలో మండల స్థాయి రీకాలింగ్ చంద్రబాబునాయుడు మానిఫెస్టో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చారని, ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చకుండా కక్ష సాధిస్తున్నారన్నారు. ప్రతి కార్యకర్త చంద్రబాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని గ్రామంలో సభలు ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వ అక్రమాలపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, అంపాబత్తిన రెడ్డెయ్య కాలాడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పటాలానికి కంప్యూటర్ల వితరణ

సిద్దవటం, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి బాకరాపేట సమీపాన ఉన్న హిందుస్థాన్ పెట్రోలియం ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ సిబ్బంది పోలీసు పటాలానికి ఉచితంగా మూడు కంప్యూటర్లు, మూడు ఐరన్ రాక్స్ అందించినట్లు కమాండెంట్ ఆనందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ పోలీసు పటాలంలో ఉన్న యూనిట్ వైద్యశాలకు ఉచితంగా కంప్యూటర్లు, ఐరన్ రాక్స్ అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఎల్ డిపో మేనేజర్ సతీష్‌కుమార్, బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీలో 150 కుటుంబాల చేరిక

ఓబులవారిపల్లె, జూలై 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఓరంపాడు, రాళ్లచెరువుపల్లె గ్రామాలలో వైసీపీకి చెందిన 150 కుటుంబాలు ఆదివారం టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ముక్కా మాట్లాడుతూ టీడీపీపై నమ్మకంలో 150కుటుంబాలు చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, పెద్దఓరంపాడు గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి పెద్ద సుబ్బారెడ్డి, కొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, కొమ్మిరెడ్డి బాబు, కొమ్మిరెడ్డి నాగభూషణంరెడ్డి, ముద్దు సుధాకర్‌రెడ్డి, సుబ్బిగారి రాజన్న, అలం నరసింహులు, ముర మురళి, బత్తల జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు

పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు కసరత్తు

- జిల్లాలో పెరగనున్న కేంద్రాలు
- ఒక్కో కేంద్రంలో 1200 మంది ఓటర్లే
- జాబితా నుంచి నాన్ రెసిడెంట్ ఓటర్ల తొలగింపు
- పూర్తయిన బీఎల్‌వోల శిక్షణ

ఎన్నికల పక్రియలో సమూల మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోనుంది. బతుకుదెరువు కోసం వలస వచ్చిన రోహింగ్యాలు ఓటు హక్కు పొంది, దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో ఇలాంటి ఓటర్లను జల్లెడ పట్టి ఏరి వేసే పక్రియకు కేంద్ర ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది.

కడప కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, నాన్ రెసిడెంట్ ఓటర్ల తొలగింపులకు సంబంధించి ఇప్పటికే బీహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఆర్ఐ) పేరుతో జూన్ నెలలో షెడ్యూల్ విడుదల చేసి ప్రక్రియను ముమ్మరం చేశారు. అదే విధానం దేశవ్యాప్తంగా అమలు జరగనున్న నేపథ్యంలో కార్యాచరణకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని మన రాష్ట్ర ఎన్నికల కమిషనరు వివేక్ యాదవ్ గత జూన్‌లో జిల్లా కేంద్రాలకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో కడప జిల్లాలో ఎన్నికల అధికారులు, సిబ్బంది స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు కసరత్తు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1200కు మించకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విదానం పక్కాగా అమలు జరిగితే జిల్లాలో ఇపుడున్న 1968 పోలింగ్ కేంద్రాలకు తోడుగా. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి మరో 500 వరకు పెరిగి 2400 పైగా పీఎస్‌లకు చేరుకోవచ్చని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.



జిల్లాలో పెరగనున్న పోలింగ్ కేంద్రాలు

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ముందస్తుగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రారంభించింది. కడప నియోజకవర్గంలో ఎన్నికల అధికారులు ఒకడుగు ముందుకేసి ఇప్పటికే 287 పోలింగ్ కేంద్రాలను ఫిల్టర్ చేశారు. దాదాపు 50 పోలింగ్ కేంద్రాలను సరిదిద్దేందుకు సిద్దమయ్యారు. 1200 మంది ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలు, పక్కా భవనాలు లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వాటిలో 25 పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ భవనాలలోకి మార్చేందుకు ఎన్నికల అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ ప్రోగ్రామ్‌కు సంబంధించి ఆగస్టు నెలలో షెడ్యూల్ విడుదల చేయనుండడంతో జిల్లాలో పోలింగ్ కేంద్రాల సంఖ్య 2400 వరకు దాటొచ్చంటున్నారు. పెరగనున్న పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా బీఎల్వోలు, ఎన్నికల రిటర్నింగ్, సహాయ అధికారుల ఖాళీలు భర్తీ చేయనున్నారు.

బీఎల్‌ఓలకు శిక్షణ పూర్తి

జిల్లాలో 16.62 లక్షల మంది ఓటర్లుండగా, 1968 పోలింగ్ కేంద్రాలు, అంతే స్థాయిలో బూత్ లెవల్ అధికారులు ఉన్నారు. వీరందరికీ ఎస్ఐఆర్ ప్రోగ్రాం కింద కలెక్టరేట్‌లోని సభాభవనంలో శిక్షణ ఇచ్చారు. జిల్లా నుంచి ఎంపిక చేసిన సచివాలయ అడ్మిన్ సెక్రటరీ ఆది చినవేమయ్య ఢిల్లీలో శిక్షణ పొంది జిల్లాలో మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించారు. కాగా ప్రతి ఏటా స్పెషల్ సమ్మరీ రివిజన్ పక్రియ జరగడం ఆనవాయితీ. ఈ దఫా ఆ ప్రక్రియ ప్రారంభం నాటికి ఎస్ఐఆర్ ప్రోగ్రాం ద్వారా సేకరించిన సమాచారంతో పక్కా ప్రణాళికతో సవరణలతో జనవరి 1 నాటికి ఓటర్ల తుది జాబితా పక్కాగా రూపు దిద్దుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కారు ఢీకొని ఒకరి మృతి

దువ్వూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మండలం సి. బయనపల్లి డాబా వద్ద ఆదివారం కారు ఢీకొని కె.మాబూషరీఫ్ (52) అనే వ్యక్తి మృతి చెందాడు. చింతకుంట గ్రామానికి చెందిన ఈ వ్యక్తి పెట్రోలు పట్టించుకుని నాలుగు రోడ్ల కూడలిలో బైక్‌ను యూటర్న్ తీసుకుని రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొందని స్థానిక పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

బాలుడిపై వీధి కుక్క దాడి



గాయపడిన సుశాంత్

బద్వేలుటౌన్, జులై 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుమిత్రానగర్‌లోని ప్రదీప్ పాఠశాల వద్ద ఆదివారం సుశాంత్ అనే బాలుడు వీధిలో ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడిచేసింది. బాలుడి కుడిచేతిని నోటితో పట్టుకుని ఈడ్చుకుంటూ వెళుతుండగా స్థానికులు గమనించి రక్షించారు. ఈ ప్రయత్నంలో మరో ఇద్దరిపై దాడి చేసింది. బాలుడి తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించారు. మున్సిపాలిటీలో ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్కలదాడిలో గాయాలపాలవుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో వేర్వేరు ప్రాతాలలకు చెందిన ముగ్గురు ఆత్మహత్యాయత్నం చేశారని ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. మదనపల్లె మండలం, పెంచుపాడుకు చెందిన బాలాజీ నాయక్ భార్య శాంతమ్మ(38) కుటుంబ కలహాల కారణంగా పురుగుల మందుతాగింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి మందలించాడని నీరుగట్టువారిపల్లెకు చెందిన రమణ కుమారుడు అశోక్ (19) పురుగుల మందు తాగాడు. స్థానికులు అతనిని ఆస్పత్రికి తరలించారు. తంబళ్లపల్లె మండలం, కోసువారిపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు నాగార్జున (22) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబసభ్యులు 108లో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రెఫర్ చేశారు

కారు, బైకు ఢీ.. యువకుడికి తీవ్ర గాయాలు

రాజంపేట టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కారును బైకు ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ప్రశాంత్ ఆదివారం సాయంత్రం బైక్‌పై వెళుతూ మండల పరిధిలోని బోయనపల్లె వద్ద కడప నుంచి తిరుపతి వెళుతున్న కారును ఢీకొన్నాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతనిని 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు తిరుపతికి తరలించారు. రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ కుళాయప్ప తెలిపారు.

యువతి అదృశ్యం



శశికళ

కలసపాడు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తన అమ్మమ్మకు ఆరోగ్యం సరిగా చూసేందుకని ఇంటి నుంచి బయలుదేరిన యువతి మూడు రోజులైనా ఇంటికి చేరలేదంటూ యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలసపాడు ఎస్ఐ తిమోతి తెలిపిన వివరాల మేరకు ప్రకా శం జిల్లా కొమరోలు మండలం రెడ్డిచర్ల గ్రామానికి చెందిన సగిలి శశికళ తన అమ్మమను చూసేందుకు ముద్దవారిపల్లెకు వెళతానని చెప్పి బయలుదేరిన ఆమె. మూడు రోజులైనా ఇంటికి చేరలేదు. అమ్మ ఇంటికి కూడా వెళ్లకపోవడంతో ఆమె తల్లిదండ్రులు సగిలి సర్వేశ్వర రావు, వేలాంగిణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వా లని ఎస్ఐ తెలిపారు.

కారుబోల్తా.. నలుగురికి గాయాలు





బోల్తాపడిన కారు, అంబులెన్స్‌లో గాయపడిన వ్యక్తి

జమ్మలమడుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తా పడడంతో నలుగురు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. ప్రొద్దుటూరులోని మేదర వీధికి చెందిన నలుగురు వ్యక్తులు ఆదివారం జమ్మలమడుగు మండలం గండికోటను చూసేందుకు వెళ్లారు. సాయంత్రం ప్రొద్దుటూరుకు తిరిగి వెళుతుండగా గొరిగెనూరు- ధర్మాపురం గ్రామాల మధ్య కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న రాతి దిమ్మెలు ఢీకొని పొలంలో బోల్తాపడింది. ఈ ఘటనలో పసుపులేటి హేమంత్, ప్రదీప్ అనేవారితోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. విషయం గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో ప్రొద్దుటూరుకు తరలించారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి సమాచారం లేదని జమ్మలమడుగు పోలీసులు తెలిపారు.

ఎర్ర బ్యాడ్జీలతో ఆర్టీసీ కార్మికుల నిరసన

జమ్మలమడుగు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు కేటాయించడంపై ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్మికులు ఆదివారం ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విజయవాడలో ప్రైవేటు సంస్థలకు గ్యారేజీ స్థలాలను అప్పగించడాన్ని రద్దు చేయాలని కోరారు. ఎస్ఎంయూ డిపో అధ్యక్షుడు బ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీసీవో రెడ్డి, కాంతయ్య, గురుస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంచ వృత్తులను పరిరక్షించాలి

- ఈశ్వరీదేవి మఠాధిపతి వీర శివకుమార స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న మఠాధిపతి వీరశివకుమారస్వామి

బ్రహ్మంగారిమఠం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచ వృత్తులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని, వాటిని కాపాడేందుకు విశ్వబ్రాహ్మణులందరూ ప్రయత్నం చేయాలని జగన్మాత ఈశ్వరీదేవి మఠాధిపతి వీరశివకుమారస్వామి పిలుపునిచ్చారు. జులై 6న తెలంగాణలోని ఎల్‌బీనగర్‌లో ప్రారంభమై 22 రోజులపాటు కొనసాగిన విశ్వబ్రాహ్మణ సాంస్కృతిక చైతన్య యాత్ర ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి మఠం చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర తొలి సభాపతి ప్రస్తుత శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బాపట్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు బంగారు బాబు, హైదరాబాదు క్రైం బ్రాంచ్ ఏసీపీ కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి మాట్లాడుతూ రానురాను విశ్వబ్రాహ్మణులు వారి నైపుణ్యాలను మరిచిపోతున్నారని, రాబోవు తరానికి కూడా చేతివృత్తులు నేర్పించాలని తెలిపారు. అనంతరం ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగిన రచయిత, క్రియాశీల విశ్వకర్మ కార్యకర్తగా విశ్వనాథుల పుష్పగిరి దశాబ్దాల కాలంగా పలు రాష్ట్రాల్లో విస్తృతంగా పని చేస్తున్నాడని, దేశవ్యాప్త విశ్వకర్మ ఉద్యమం నిర్మించేందుకు పెద్ద ఎత్తున కార్యాచరణ రూపొందిస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఈ పాదయాత్ర నిర్వహించారన్నారు. విశ్వబ్రాహ్మణులు సాంస్కృతికంగా పునర్వైభవం సాధించాల్సిన ఆవశ్యకతను వివరించారు. బాపట్ల బీజేపీ అధ్యక్షుడు బంగారుబాబు , మధుసూదనచారి మాట్లాడుతూ దేశంలో సంస్కృతీ సంప్రదాయాలకు మూలస్థానంగా నిలిచిన దేవాలయాలకు విశ్వబ్రాహ్మణులే మూలకారణంగా నిలిచారన్నారు పాదయాత్ర ద్వారా విశ్వబ్రాహ్మణ సమస్యలపై పోరాటం సాగించడంలో విశ్వనాథుల పుష్పగిరి సఫలమయ్యాడని, విశ్వ బ్రాహ్మణులు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమయ్యే సందర్భాన్ని సృష్టించాడన్నారు. విశ్వకర్మలు ఐక్యంగా నిల బడి తమ శక్తిని నిరూపించుకోవాలన్నారు. లక్ష్మీనారాయణ, కంజర్ల కృష్ణమూర్తి, సొల్లేటి ప్రభాకరచారి, బాల నరసింహచారి, రంజిత్, బుగ్గిర్ల సతీష్, రాజశేఖర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో సమస్యలను పరిష్కరించుకుందాం..

- ఏపీ మత్స్యకార నేత అర్జున్



సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్

కడప మారుతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న మత్స్యకారుల సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకుందామని ఏపీ సంప్రదాయ మత్స్యకార కులాల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ అర్జున్ సూచించారు. ఆదివారం స్థానిక రాజీవ్ పార్క్ సమీపంలోని సమాఖ్య జిల్లా కార్యాలయంలో జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షుడు యాటగిరి రాంప్రసాద్ అధ్యక్షతన రాయలసీమ స్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాయలసీమ జిల్లాల్లోని వన్నెకుల క్షత్రియ, బెస్త తదితర మత్స్యకార కులాలకు వివిధ కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులు కేటాయించడంతో పాటు సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపత్ యోజన కింద ఇస్తున్న పథకాలలో సబ్సిడీ 40 శాతం నుంచి 80 శాతానికి పెంచాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని తీర్మానం చేశామన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అర్జున్ సమక్షంలో రాయలసీమ జిల్లాల కమిటీని ఎన్నుకున్నారు. ఆ మేరకు కడప జిల్లా అధ్యక్షుడుగా వై. శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడుగా బాలసుబ్రమణ్యం,ప్రధాన కార్యదర్శిగా హోళిసాయితోపాటుగా సీమ నాలుగు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున మత్స్యకారులు పాల్గొన్నారు.

భారీ తేడాతో అనంతపురం విజయం

- చిత్తూరు-నెల్లూరు మ్యాచ్ డ్రా



కిరణ్‌కుమార్ ఆరు వికెట్లు



హర్ష (చిత్తూరు) 167పరుగులు



తనీశ్వర్ 102 పరుగులు

కడప స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్ 16 మూడు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో ఆదివారం కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు 221 పరుగులు భారీ తేడాతో విజయం సాధించింది. అలాగే చిత్తూరు - నెల్లూరు జట్ల మధ్య జరుగుతున్న మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. వివరాలిలా..

కేఓఆర్ఎం మైదానంలో

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో మూడోరోజు బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 70.4 ఓవర్లలో 9 వికెట్లు నష్టానికి 295 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. దీంతో రెండు ఇన్నింగ్స్‌లు కలిపి 505 పరుగులు చేసినట్లయింది. ఇందులో దేవాన్ష్ 41 పరుగులు చేశారు. అనంతరం కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లోకి దిగి ఆట ముగిసే సమయానికి 49.1 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌటైంది. దీంతో అనంతపురం 221 పరుగులతేడాతో విజయం సాధించింది. అనంతపురం బౌలరు కిరణ్‌కుమార్ ఆరు వికెట్లు తీసుకున్నాడు

ఏసీఏక్రికెట్ మైదానంలో

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో చిత్తూరు - నెల్లూరు జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో రెండో రోజు నెల్లూరు జట్టు 103.5 ఓవర్లలో 288 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టుకు 18 పరుగుల మొదట ఇన్నింగ్స్ ఆధిక్యత లభించినట్లయింది. ఇదిలా ఉండగా ఓవర్ నైట్ స్కోరు 40 పరుగులతో మూడోరోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 99 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 414 పరుగులు సాధించింది. ఇందులో హర్ష 167 పరుగులు, తనీశ్వర్ 102 పరుగులు చేయడం విశేషం. ఎంఎస్ అహ్మద్ 83 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు





రన్నింగ్ చేస్తున్న క్రీడాకారులు, హైజంప్ చేస్తున్న యువకుడు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఆదివారం ఉదయం బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జూనియర్ అథ్లెటిక్స్, అండర్-18, అండర్-20 మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 100, 200, 400, 800 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రో, షాట్‌పుట్, హైజంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన 40 మంది క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. వీరు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో బాపట్లలో రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ కార్యదర్శి అహమద్‌బాషా, వ్యాయామ సంచాలకులు నాగూర్, శివారెడ్డి, సుబ్బయ్య, ఎర్రన్న, నాగేశ్వరరావు, దిలీప్, ఖాదర్‌రెడ్డి, బాషా పాల్గొన్నారు.

ఆస్పత్రి ముందు ప్రైవేటు అంబులెన్స్‌ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మదనపల్లె అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఘర్షణ శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రి ముందు ఉన్న అంబులెన్స్‌లు తొలగించారు. ఇకపై అక్కడ అంబులెన్స్‌లు నిలుప రాదని హెచ్చరించారు. అంబులెన్స్ డ్రైవర్లను టూటౌన్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సీఐ రామచంద్ర తెలిపారు.



అంబులెన్స్‌ల తొలగింపుతో ఖాళీగా ఆస్పత్రి పరిసరాలు

రూ. 38.8 కోట్లతో గుంజన నదికి రక్షణ గోడ



గుంజన నది వద్ద పంతగానితో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

రైల్వేకోడూరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గుంజన నదికి రక్షణగోడ నిర్మాణానికి రూ. 38.8 కోట్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆదివారం గుంజననది ప్రాంతా న్ని ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. గుంజన నదికి వరదల కారణంగా ప్రతి ఏటా నిరుపేదల ఇళ్లు కొట్టుకుపోతున్నాయని, దీంతో వారు ఇతర ప్రాంతాలకు వెళ్లి తల దాచుకోవాల్సి వస్తోందన్న విషయాన్ని టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మంత్రి స్పందించి పనులు అతి త్వరగా గుంజన నదికి రక్షణగోడ నిర్మాణ పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పోతు రాజు నవీన్, నార్జాల హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజకు విరాళం అందిస్తున్న పబ్బతి రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు

చక్రాయపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో జరిగే శాశ్వత నిత్యన్నదాన పథకానికి ఆదివారం రూ.1,01,116 విరాళం అందినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా పులివెందులకు చెందిన పబ్బతి రాధాకృష్ణమూర్తి జ్ఞాపకార్థం కృష్ణవేణమ్మ కుమారుడు దక్షిణామూర్తి ధర్మపత్ని లక్ష్మీప్రసన్న ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. ఈ విరాళాన్ని ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన అర్చకుడు వర్రి కేసరిలకు అందించినట్లు తెలిపారు. వీరికి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి తీర్థ, ప్రసాదారాలు అందించడం జరిగిందన్నారు.

వృక్షాల కూల్చివేతపై నోటీసులు జారీ



విద్యుత్ సిబ్బంది కూల్చివేసిన వృక్షాలు

సిద్దవటం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ పనుల్లో భాగంగా బాకరాపేట ఫారెస్ట్ బీట్ పరిధిలో టేకు చెట్లను కూల్చి వేసిన విద్యుత్ అధికారులకు నోటీసులు జారీ అయ్యాయి. ఈ విషయంపై ఆదివారం కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ కడప రేంజి బాకరాపేట బీట్ పరిధిలోని ఓ రైతు సాగు చేసిన పెద్ద పెద్ద వృక్షాలు, టేకు చెట్లను విద్యుత్ అధికారులు పూర్తిగా తొలగించారన్నారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం అందించక పోవడంతో వారికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. అటవీ పరిధిలోని పంట పొలాల్లో, బీడు భూముల్లో, రైతు పంట పొలాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా చెట్లు తొలగించరాదని, పర్యావరణాన్ని కాపా డే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆయన వివరించారు.

చెరువు కట్టపై గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పెద్దతిప్పసముద్రం జూలై 27 (ఆంధ్రజ్యోతి): రంగసముద్రం చెరువు కట్టపై రెండు రోజులుగా జరుగుతున్న గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. గతంలో ఈ చోట పురాతన విగ్రహం ఉండగా దాని స్థానంలో నూతన విగ్రహాన్ని గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠ, నేత్రోన్మీలనం, కదళీచ్ఛేదన, కళాకర్షణ హోమం, పూర్ణాహుతి, అమ్మ వారికి విశేష అలంకరణ, గోపూజ, అష్టబలి, మహామంగళ హారతి, కలశ ఉద్వాసన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఎదుట భజనలు నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠను తిలకించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం'



కాల్వపల్లెలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న టీడీపీ నేతలు

ములకలచెరువు, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ అన్నారు. మండలంలోని కాల్వపల్లెలో ఆదివారం రాత్రి తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆదేశాలతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నాయకులు మస్తాన్, మునిస్వామి, శంకర, మౌలాసాహెబ్, నాగరాజు, ఖాదర్, అంజన్న, ఆదర్శ్ ఫకృద్దీన్, సుబ్బిశెట్టి, చలపతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి



కస్తూర్బా బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు

బి.కొత్తకోట, జూలై(ఆంధ్రజ్యోతి): సైబర్‌నేరాలు, మహిళా రక్షణ కోసం ప్రభుత్వం చేసిన చట్టాలు, తీసుకొచ్చిన యాప్‌లపై అవగాహన కలిగివుండి అన్ని విధాలా సేఫ్‌గా వుండాలని బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం కస్తూర్బా జూనియర్ కళాశాల విద్యార్థినులకు పోలీసులు నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన శక్తియాప్‌ను వాట్సాప్ 7993485111 మహిళలు, విద్యార్థినులు అందరూ తమ మొబైళ్లలో సేవ్ చేసుకోవాలన్నారు. సరదాకోసం మాదకద్రవ్యాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. లాభాల పేరుతో మాయచేసే క్రిప్టోకరెన్సీ, ఫారెక్స్ ట్రేడింగ్ లాంటి మోసాలకు గురికావద్దన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఈవ్‌టీజింగ్‌పై ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళారక్షణ యాప్‌లపై అవగాహన పెంచుకోవడం, ఇతర మహిళలకు కూడా చెప్పాలన్నారు. ఎవరైనా తాము సైబర్ మోసానికి గురయ్యామని భావిస్తే వెంటనే 1930కు కాల్ చేయాలని విద్యార్థిని లకు సూచించారు. కార్యక్రమంలో కస్తూరిబా ఎస్వో విశ్వలత, సిబ్బంది పాల్గొన్నారు.


రాయలసీమ నుంచే రాష్ట్ర పర్యటన



మాధవ్‌ను సన్మానిస్తున్న వరదారెడ్డి నారదరెడ్డి, బండి ఆనంద్

మదనపల్లె అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్య తలు చేపట్టిన తరువాత మొదటి సారి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కడపకు ఆదివారం విచ్చేశారు. ఇక్కడి నుంచే రాయలసీమ పర్యటన మొదలు పెడుతున్నట్లు ఆయన అన్నారు. మదనపల్లె బీజేపీ నేతలు జర్న సీరాజు, బండి ఆనంద్, వరదారెడ్డి నారథరెడ్డి, పులి నరేంద్రారెడ్డి, రామిరెడ్డిగా రిపల్లె వెంకటరమణారెడ్డి, కిరణ్‌కుమార్ కడపలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

పేరు మోడల్ - వసతులు నిల్



సమస్యలతో సహజీవనం ● కానరాని మురుగునీటి కాల్వలు

మౌలిక వసతులు మృగ్యం ● కొరవడిన పారిశుధ్యం

● ఇంకుడు గుంతల్లా ఇళ్ల ముందు మురుగునీటి గుంతలు

పీలేరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మోడల్ కాలనీ అంటూ పేరు పెట్టి అట్టహాసంగా మొదలెట్టారు. అయితే పేరుకు తగ్గట్లు వసతులు కనబడడంలేదు. పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్నా చుట్టూ సమస్యలతో సహజీవనం చేస్తూ కాలనీ వాసులు కాలం వెల్లదీస్తున్నారు. మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించక పోయినా సమస్యలైనా అధికారులు పట్టించుకున్నారా అదీ లేదు. రెండున్నర దశాబ్దాలుగా కనీస వసుతులకు నోచుకోక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకెళితే....

చిత్తూరు రోడ్డులో పట్టణానికి కూతవేటు దూరంలో 1998లో అప్పటి ప్రభుత్వం మోడల్ కాలనీ నిర్మించింది. ఇక్కడ ప్రస్తుతం సుమారు 500 పైగా కుటుంబాలున్నాయి. ఇక్కడ నివసిస్తున్న వారిలో ఎక్కువ మంది రోజువారి కూలీలే. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వసతులు కల్పిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇస్తున్న హామీలు కార్యరూపం దాల్చడంలేదు. అధికార పార్టీ నేతలు అడ్డగోలుగా సిమెంట్ రోడ్లు వేసి చేతులు దులిపేసుకున్నారే తప్ప కాల్వల పట్ల దృష్టిసారించడం లేదు. దీంతో మురుగు బయటకు వెళ్లే మార్గం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎవరికి వారు ఇళ్ల వద్దే గుంతలు తవ్వి అందులోకి మురుగునీరు మళ్లిస్తు న్నారు. కాలనీలో పారిశుధ్య కార్యక్రమా లు మొక్కుబడి తంతుగా నిర్వహిస్తుండడంతో దోమల బెడద పెరిగి జనం రోగాలు బారిన పడు తున్నారు. ఎక్కడ పడితే అక్కడ ముళ్ల పొదలు అల్లుకు పోయాయి. చెత్తాచెదారం పేరుకుని నిత్యం పాముల బెడదతో జనం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ వాసుల అవసరాలకు సరి పడా తాగునీరు అందడంలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే తాగునీరు వస్తోంది. అతికష్టంపై చేతి బోర్ల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు.

చినుకు రా లితే చిత్తడే. ఓ క్రమపద్ధతి లేకుండా సీసీ రోడ్లు వేయడంతో చినుకు రాలితే కాలనీ అంతా చిత్తడి గా మారుతోంది. మురుగు కాల్వలు లేనందున పడిన చినుకు పల్లపు ప్రాంత ఇళ్లలోకి దూరు తోంది. దీంతో పలువురు వర్షం వస్తే జాగారం చేయాల్సిన దుస్థితి.

మురుగు కాల్వ నిర్మాణానికి సర్వే

మోడల్ కాలనీలో మురుగు కాల్వల నిర్మాణం కోసం సర్వే జరుగుతోంది. సుమారు కోటి వరకూ అవసరం ఉంటుందని ప్రాథమిక అంచనా. పూర్తి స్థాయిలో నివేదిక సిద్ధం చేసి ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డితో సంప్రదించి ముందుకెళతాం. సకాలంలో తాగునీరు, శానిటేషన్, వీధి దీపాల ఏర్పాటు, వసతుల కల్పనపై దృష్టి సారించాం.

లతీఫ్ ఖాన్, పంచాయతీ ఇన్‌చార్జి ఈఓ



ఇళ్ల మధ్య అల్లుకు పోయిన పొదలు

చేసిందేమీలేదు



ఓట్ల కోసం వచ్చే నేతలు కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్నారు తప్ప ఇన్నేళ్లుగా ఏం చేశారు. వాన వస్తే ఇట్లోకి నీళ్లు వస్తాయి. కాల్వలులేవు. రాత్రంతా జాగారమే. మా ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలి. సక్రమంగా తాగునీరు రావడంలేదు.

అమరావతి, మోడల్ కాలనీ

పాములతో ఇబ్బంది



పాముల బెడద ఎక్కువగా ఉంది. రాత్రుల్లో వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదు. పాములు ఇళ్లలోకి వస్తాయి. పంచాయతీ వాల్లు పట్టించుకో వడం లేదు. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. ఎవరొచ్చినా మాబాదలు ఇంతే. కాలనీ కట్టిన ప్పటి నుంచి ఇక్కడే ఉన్నాం.

రమణమ్మ, మోడల్ కాలనీ



ఇళ్ల వద్ద మురుగునీటి గుంత

పాడి రైతుల సంక్షేమానికి బ్లాంకెట్ సర్వే



బ్లాంకెట్ సర్వేను తనిఖీ చేస్తున్న డాక్టర్ సురేష్ తదితరులు

నిమ్మనపల్లి, జూలై 27(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షే మానికి బ్లాంకెట్ సర్వే చేపట్టినట్లు పశువైద్యాధికారి సురేష్ తెలిపారు. పాడి రైతులు సమగ్ర సమాచారం సేకరించి వారికి అవసరమైన సంక్షేమ పథకాలు అందించడాన్ని బ్లాంకెట్ సర్వే అంటారు. మండలంలో దాదాపు 4229మంది పాడి రైతుల్లో మొదటి విడతలో 80శాతం(3452మంది) సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. సర్వేలో పాడి రైతు పూర్తి వివరాలను పొందుపరుస్తామన్నారు. సెప్టెంబరు 15 వరకు సర్వే కొనసాగుతుందని తమ సిబ్బంది ప్రతి గ్రామంలో పర్యటించి సర్వే నిర్వహిస్తారని, రైతులు పూర్తి వివరాలను ఇవ్వాలని తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు ఘనసన్మానం



జంగాల శివరాంను సన్మానిస్తున్న లారీ అసోసియేషన్ సభ్యులు

మదనపల్లె, జూలై 27(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన జనసేన నేత జంగాల శివరాంను మదనపల్లె లారీ అసోసియేషన్ సన్మానించింది. శివరాం నివాసానికి వెళ్లి వారు అభినందించారు. కార్యక్రమంలో లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, కార్యదర్శి అహ్మద్ పీరా, కోశాధికారి సురేంద్ర నాయుడు, సంయుక్త కార్యదర్శి గంగాధర్, సభ్యులు షమి, నాగభూషణం, హుస్సేన్ బాషా, సర్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.

మేడికుర్తి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల కలయిక

కలికిరి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మేడికుర్తి ఉన్నత పాఠశాలలో 1995-96 లో టెన్త్ చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించా రు. 30 ఏళ్ల కిందటి ముచ్చట్లను పంచుకున్నారు. డిజిటల్ కాలింగ్ బెల్, ఆఫీసు రూము ద్వారం, అవసరమైన కుర్చీలు సమకూర్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. నాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులు లక్ష్మీరెడ్డి, వెంకట్రమణా రెడ్డి, బసవయ్య, ఆనంద రెడ్డి పాల్గొన్నారు. దాదాపు పాతికమంది పూర్వ విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

సూపర్ సిక్స్ అమలులో వైఫల్యం : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు

పీలేరు రూరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే ప్రజావ్యతిరేకతను కూడగట్టుకుందని, సూపర్ సిక్స్ పథకాల అమలులో వైఫల్యం చెందిందని సీపీఐ జిల్లా కార్యదర్శి పీ.ఎల్. నరసిహులు ఆరోపించారు. ఆదివారం పీలేరులో పీలేరు నియోజక వర్గ రెండో మహాసభ సందర్భంగా క్రాస్ రోడ్ నుంచి ఈద్గా వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, రైతు పెట్టుబడి సాయం డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. ఏడాదికి ఇస్తామన్న మూడు వంట సిలిండర్లు అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎడాపెడా విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నపుడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన కూటమి నేతలు ప్రస్తుతం స్మార్ట్ మీటర్ల బిగింపు ఎవరి ప్రయోజనాల కోసమో చెప్పాలని డిమాండ్ చేశారు. హంద్రీ నీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేసి సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్ట్ వెంటనే నిర్మించాలని తెలిపారు. కడప-బెంగళూరు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆగస్టు 10వ తేదీ నుంచి 12వరకూ మదనపల్లెలో జరిగే సీపీఐ జిల్లా 2వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, పీలేరు కార్యదర్శి టీ.ఎల్. వెంకటేష్, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు మాధవ్, జక్కవ వెంకటేష్, సీపీఐ సహాయ కార్యదర్శి నరసింహులు, యూనియన్ నేతలు పీ.వీ. రమణ, యశోద, శ్రీనివాసులు, డప్పుకళాకారులు, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా రమణ



నియామక పత్రం అందుకుంటున్న మడితం రమణ

మదనపల్లె అర్బన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఏపీ సంప్రదాయ మత్స్యకారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా మడితం రమణను ఎంపిక చేశారు. ఆదివారం కడప టౌన్‌లోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నడిగుడి అర్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన మత్స్యకారులు సమావేశంలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా సురేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడిగా మడితం రమణ, కార్యదర్శులుగా బి. వెంకటేష్, రామయ్య, సురేంద్ర, హరి, రమణ, ఈశ్వర్, ఎన్నికయ్యారు. జిల్లా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లాలో మత్స్యకారుల సొసైటీలను బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలో మత్స్యకారులు అభ్యున్నతికి పోరాడతానన్నారు.

ప్రజలకు పథకాలు వివరించాలి

మదనపల్లె టౌన్, జూలై 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు స్ఫూర్తితో ప్రతి టీడీపీ నేత సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోడెం సిద్ధప్ప పేర్కొన్నారు. ఆదివారం 33వ వార్డులో సిద్ధప్ప ఆధ్వర్యంలో సుపరిపాలన-తొలిఅడుగులో వార్డులోని ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేసిన, అమలు చేయనున్న మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం పథకాన్ని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రెడ్డికేశవ, గడ్డం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిటీ ఎంపిక

బి.కొత్తకోట, జూలై 27(ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్‌రైట్స్ కమిటీ సర్వీస్ రాష్ట్ర, జిల్లా కార్యవర్గాల నియామకం చేసినట్లు ఆ సంస్థ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కావడి రవీంద్ర పేర్కొన్నారు. స్థానిక సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర లీగల్‌సెల్ అధ్యక్షుడిగా మాదినే శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా డేరింగుల నారాయణ, రాష్ట్ర కార్యదర్శిగా గోపాల్, ను నియమించారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నగీనా, ప్రధాన కార్యదర్శులు వెంకట్రమణారెడ్డి, సిద్ధు, శివకుమార్, అబ్బాస్ పాల్గొన్నారు.

సేవలను విస్తరించాలి

కలకడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో మానవత సేవా కార్యక్రమాలను విస్తరింప జేయాలని జిల్లా కార్యవర్గ సభ్యులు వై.వి. రమణ పిలుపునిచ్చారు. ఆదివారం బాటవారిపల్లిలో జరిగిన నెలవారీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో చదివే పిల్లలకు మానవీయ విలువలపై అవగాహన కల్పించాలని సూచించారు. పచ్చదనం పెంపొందెలా మొక్కలు నాటించడం, మూడు నెలలకోమారు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. మండల శాఖ అధ్యక్షుడు పి.వి. నాయుడు, సభ్యులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి

మదనపల్లె టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలని వెల్ విషర్స్ సంస్థ నిర్వాహకుడు గిరీష్ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో కలాం వర్ధంతికి ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. సాయిచిత్ర భాస్కర్, లక్ష్మీపతి, వినయ్, భానుప్రకాష్, రాజేంద్ర పాల్గొన్నారు.



కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సరిహద్దు గ్రామం - అడ్డులేని అసాంఘికం

● ఇష్టారాజ్యంగా కోడిపందేలు, పేకాట ● పోలీసుల అండదండలతో యథేచ్ఛగా...

● మామూళ్ల మత్తులో జోగుతున్న వ్యవహారం ● కన్నెత్తి చూడని పోలీసులు

పెద్దతిప్పసముద్రం జూలై 27 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దు గ్రామం కావడంతో అడ్డూ అదుపులేకుండా అసాంఘికం పేట్రేగుతోంది. ఒకటేమిటి కోడిపందేలు, పేకాట బహిరంగంగా జోరుమీదుందంటే పోలీసుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని చెప్పవచ్చు. పంట పొలాల్లో కోడిపందేలు, పేకాడేందుకు నిర్వహకులకు కొంత మొత్తం ముట్టజెప్పే సంప్రదాయం కొనసాగుతోంది. చివరికి కోడి పందేలు చూసేందుకు కూడా సొమ్ము వసూలు చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్ర జూదరులు అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోల్లో ఇక్కడికి వస్తున్నారంటే ఇక్కడ అసాంఘికం ఏ స్థాయిలో జరుగుతోందో ఇట్టే అర్థమవుతుంది. గ్రామాల్లో లక్షల్లో పందేలు పెడుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడలేదంటే నిర్వాహకులు ఎంతస్థాయిలో మామూళ్లు అందిస్తున్నారో దేవుడికే తెలియాలి. వివరాల్లోకెళితే....

పెద్దతిప్పసముద్రం మండలంలో బూచిపల్లె, నవాబుకోట, పాతకందుకూరు కర్ణాటక రాష్ట్రానికి సరిహద్దు గ్రామాలు. అయితే నవాబుకోటకు పందేలను ఆడేందుకు కర్ణాటక రాష్ట్ర జూదరులు క్యూకట్టారు. ద్విచక్రవాహనాలు, కార్లు, చివరికి ఆటోల్లో అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తున్నారు. నవాబుకోట సమీప పొలాల్లో యథేచ్ఛగా కోడిపందేలు, పేకాటతో అసాంఘిక రాజ్యమేలుతోంది. జూదం ఆడేందుకు సొమ్ము చెల్లిస్తున్నారంటే సరి, పందేలు తిలకించాలన్నా రోజుకు ఒక్కొక్కరు రూ. 200 చెల్లించాలి. అంతేకాదు ఇక్కడ దుకాణాలు నిర్వహించాలన్నా రూ. 500 చొప్పున కప్పం కడుతున్నారంటే ఇక్కడ జరుగుతున్న జూదం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది. గ్రామాల్లో ఎవరైనా కొత్తవారు వచ్చినా, అనుమానాస్పదులు తిరుగుతున్నా మాకు సమాచారం అందించండి అంటూ ప్రకటనలు గుప్పించే పోలీసులకు ఇంత పెద్దమొత్తంలో వస్తున్న జూదరులు కంట బడినట్లు లేదు. ఇక్కడ జూదరులకు మద్యం సైతం విచ్చ లవిడిగా దొరుకుతోందనే విమర్శలు లేకపోలేదు. జేబులు ఖాళీ చేయించుకుని నడిరోడ్డుపై నిలిచి పరువు, డబ్బు పోగొట్టుకుని పలుకుటుంబాలుఆర్థికంగా చతికలబడుతున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా వ్యవసాయ బోర్ల వద్ద వందల సంఖ్యలో జూదరులు ఆటాడు తుండడంతో పొలం పనులు చేసుకునే మహిళలు అటువైపు పొలాల వద్దకు వెళ్లాలన్నా భయపడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు మహిళలు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో మోటర్లు, కేబుల్ వైర్లు, స్టాటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనాలకు గురవుతున్నాయని పోలీసులకు అందే ఫిర్యాదులు చూస్తుంటే ఇంత మంది జూదరులు ఆడుతుండగా మరో దొంగ ఎక్కడి నుంచి వస్తాడని అనుమానిస్తున్నారు. అయితే జూదం ఆడే ప్రదేశాల్లో నిర్వహకులు ప్రైవేట్ సైన్యం తనిఖీ చేస్తుండడం, నిర్వహకుల ప్రత్యేక పర్యవేక్షణలో సాగుతున్న జూదం ఓ ప్రహస నంలా సాగుతోంది. ఎవరైనా అటు వైపు వెళ్లాలన్నా ప్రైవేటు సైన్యం దాటుకుని వెళ్లాల్సి వస్తోంది.



నవాబుకోట శివారుల్లో జోరుగా కోడిపందేలు



పొలాల్లో ఆడుతున్న పేకాటరాయుళ్లు

మామూళ్ల మత్తులో జోగుతున్న పోలీసులు

గ్రామంలో చీమ చిటుక్కుమన్నా తెలిసిపోయే పోలీసులను నిర్వాహకులు ఏ స్థాయిలో లోబ రుచుకున్నారో ఆలోచించాల్సి ఉంది. బహిరంగం గా కోడిపందేలు, పేకాడడం, మద్యం సైతం ఇక్కడే దొరుకుతోందంటే పోలీసులకు తెలియ కుండా జరిగే అవకాశం ఉండదని పలువురు ఆరోపిస్తున్నారు. పెద్దతిప్పసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలాంటి జూదం ఆడించాలం టే స్థానిక పోలీసులు ఏర్పాటు చేసిన ప్రైవేటు వ్యక్తుల వద్దకు మామూళ్లు అందిస్తున్నట్లు సమాచారం. ప్రతి కేసుకు ఓరేటు నిర్ణయించి ప్రజల నుంచి భారీ మొత్తంలో గుంజుతున్నా రని ప్రజలు తీవ్ర స్థాయిలో ఆరోపిస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల ద్వారా మామూళ్లను వసూలు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నట్లు విశ్వా సనీయ సమాచారం. మామూళ్లకు అలవాటు పడిన అధికారులపై జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టి మండలంలో ఇలాంటి జూదం జరగకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఈ విషయమై ఎస్ఐ హరిహర ప్రసాద్ వివరణ ఇస్తూ ముందస్తు సమాచారం ప్రకారం అక్కడక్కడా కేసులు నమోదు చేస్తున్నాము. జూదం విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా సమాచారం అందిస్తే కేసులు నమోదు చేస్తాము.